# మొక్కుబడి పంతుళ్ళు

జిల్లాస్థాయిలోను రాష్ట్రస్థాయిలోను, దేశస్థాయిలోను ఆదర్శ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఒక విద్యాశాఖాధికారి సన్మానకార్యక్రమం ఏర్పాటు చేశారు. ముగ్గురు ఉపాధ్యాయులను, అంటే ప్రాథమిక, ఉన్నతపాఠశాల స్థాయిలో ఎన్నికైన వారికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో తమ సహచరులు ఉత్తమ ఉపాధ్యాయులుగా బహుమతులందుకున్నందుకు వారికి తోచిన రెండు ప్రశంసావాక్యాలు చెప్పారు. చివర, జిల్లావిద్యాశాఖాధికారి తమ సందేశాన్నందించారు. "విద్య అనేది కేవలం జ్ఞానం సముపార్జనకే కాదు. విద్యార్థికి సౌశీల్యం కలిగించడానికి దోహదం చెయ్యాలి. నేటి బాలలే రేపటి పౌరులు. అందువల్ల చదువుతోపాటు బాలబాలికల్లో ఆటపాటలు చిత్రలేఖనం సాహిత్యవ్యాసంగం అలవరిచి మంచి రచయితలుగాను, గానకళాకోవిదులుగాను చిత్రకారులుగాను తీర్చిదిద్దాలి. దేశస్థాయిలో పోటీ పరీక్షలు రాసి, ఉన్నతోద్యోగాలు పొందేలా సమాయత్తం చేయాలి. ఆ విధంగా వారిలో దాగివున్న ప్రతిభా పాటవాలను ఉపాధ్యాయులు బహిర్గతం చేయాలి. పాఠాలు చెప్పడంలో ఉపాధ్యాయులకు శ్రద్ధ లేకపోతే, పిల్లలకు శ్రద్ధ ఎలా ఉంటుంది? ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడంలో మనస్సు కేంద్రీకరించకుండా బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమైందని తెలియగానే, తమ పొలాలకు ఎంత నీరు చేరిందో అని వారి మనస్సు కేంద్రీకృతమవుతూంది. ఎంతసేపూ వాళ్లకు ఇంక్రిమెంట్లు ఎప్పుడు వస్తాయా? ట్రిబ్యునల్‌లో వేసిన కేసులు ఎప్పుడు పరిష్కారమవుతాయా? ప్రమోషన్లు ఎప్పుడు వస్తాయా? అన్న ధ్యాస తప్ప పిల్లలకు పాఠాలు ఎంతశ్రద్ధాసక్తులతో చెప్పాలో అన్న ధ్యాసే లేదు. నేనెవర్నీ వ్యక్తిగతంగా విమర్శిస్తున్నానుకోకండి. జనరల్‌గా అన్నాను" అని తన ప్రసంగం ముగించారు.

విద్యాశాఖాధికారి ప్రసంగం ముగియుగానే ప్రేక్షకుల కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. సన్మానితులైన ముగ్గురు అధ్యాపకుల్లోనూ ఇద్దరు మాత్రం జిల్లా

విద్యాశాఖాధికారి మహోదయులు సూచించినట్లు నడుచుకుంటామని, తమకు జరిగిన ఈ సన్మానం కోటిగుణితంగా భావించుకుంటామని కృతజ్ఞతలు తెలియజేశారు. ఇహ మిగిలిన సన్మానితురాలైన శ్రీమతి మధురభాషిణి తమకు జరిగిన ఈ సన్మానానికి కృతజ్ఞతలు చెబుతూ అన్నది. "జిల్లా విద్యాశాఖాధికారి మహోదయులు, అధ్యాపకులు శ్రద్ధాసక్తులతో పాఠాలు చెప్పాలి కాని, ఎల్లప్పుడూ జీతభత్యాలు ప్రమోషన్లు అంటూ కూర్చోవద్దని ఉపాధ్యాయలోకానికి సలహా చెప్పారు. వారికి నా ధన్యవాదాలు, కాని ఇక్కడ నేనో కథ చెప్పాలి. ఒక ప్రముఖ ఋషివర్యుడు ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్నారంటే విందామని మిథిలానగరాధిపతి జనకమహారాజు, తన కోటకు ఆవల ఒక దేవాలయంలో ఉన్నారు. ఇంతలో మిథిలానగరంలోని తన "కోట మంటల్లో కాలిపోతోంది! లేవండి!" అని కేకలు వేసినా జనకమహారాజు, ఋషివర్యులు బోధిస్తున్న ఆధ్యాత్మిక ప్రసంగంలో నిమగ్నులయ్యారు. తనకు ఎవరు, ఏం చెబుతున్నారో వినిపించలేదు. జనకుని వంటి విద్యార్థులు శ్రద్ధాసక్తులతో పాఠాలు వింటే, మేమూ శ్రద్ధాసక్తులో పాఠాలు చెప్పగలం. నేనూ ఏ విద్యాధికారినీ వ్యక్తిగతంగా విమర్శిస్తున్నాననుకోవద్దు. జనరల్‌గా అన్నాను" తన కృతజ్ఞతా నివేదనం, అభిభాషణం పూర్తి చేసింది మధురభాషిణి. ఎప్పట్లాగే మొక్కు 'బడి'గా జరుగుతుందనుకున్న 'బడి' పంతుళ్ల సన్మానసభ అందుకు భిన్నంగా జరిగింది!

26 అక్టోబరు 2002<br>**ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక**